క్లుప్తంగా

జెడ్పీ హైస్కూల్లో విజిలెన్స్ తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న విజయకృష్ణ

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని లక్కవరం జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకం అమలు, విద్యార్థుల సంఖ్య, వంటశాల, వసతులు, వంటకాలను మంగళవారం జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు వంటిపల్లి విజయకృష్ణ పరిశీలించారు. పరిశుభ్రతను పాటించాలని సిబ్బందికి సూచించారు. మంచినీటి సదుపాయాలను, నీటి శుద్ధి యంత్రం పని తీరుపై ఆరా తీశారు. విద్యార్థులతో మాట్లాడారు. ఈ మేరకు వివరాలతో నివేదిక జిల్లా కలెక్టర్‌కి అందజేస్తానని విజయకృష్ణ తెలిపారు.

10న చలో విజయవాడ



పోస్టర్ విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు

జంగారెడ్డిగూడెం: సీపీఎస్ రద్దు కోరుతూ డిసెంబర్ 10న నిర్వహించే చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీసీపీఎస్‌ఈఏ రాష్ట్ర కార్యదర్శి ఆర్ నాగదుర్గారావు కోరారు. మంగళవారం మండలంలోని తాడువాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జంగారెడ్డిగూడెం బాలుర ఉన్నత పాఠశాల, ఎంపీయుపీ ఎ.పోలవరంలో చలో విజయవాడ పోస్టర్లను విడుదల చేశారు. నాగదుర్గారావు మాట్లాడుతూ సీపీఎస్ ఉద్యోగులకు 2018 జూలై నుంచి డీఏ బకాయిలను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రమేష్, ఏసురత్నం, భాస్కర్, రామదాసు, చందుమణి, చాయారాణి, విజయ శాంతి తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపుల మూసివేత



మద్యం షాపునకు సీల్ వేసిన దృశ్యం

జంగారెడ్డిగూడెం: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగా జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని మద్యం షాపులను మూసివేశారు. ఈ నెల 5న ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశాలు మేరకు మద్యం షాపులు, బార్‌లకు సీల్ వేసినట్టు ఎక్సైజ్ సీఐ శ్రీనుబాబు తెలిపారు. తిరిగి 5వ తేదీ సాయంత్రం ఎలక్షన్ ముగిసిన తరువాత మద్యం షాపులు, బార్‌లు తెరుస్తారని చెప్పారు. మొత్తం 16 మద్యం షాపులు, 2 బార్‌లను మూసివేశామని తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

13 నుంచి సీపీఎం జిల్లా మహాసభలు



పోస్టర్ విడుదల చేసిన నాయకులు

బుట్టాయగూడెం: ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు బుట్టాయగూడెంలో నిర్వహించే సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి కోరారు. మహాసభల పోస్టర్‌ను స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ మూడేళ్లకోసారి జరిగే జిల్లా మహాసభలు మొదటిసారిగా పోరాటాలకు కేంద్రమైన బుట్టాయగూడెంలో నిర్వహించనున్నట్టు చెప్పారు. భూ పోరాటాలు ప్రారంభించి 30 ఏళ్లు కావొస్తుందన్నారు. 13వ తేదీన బహిరంగ సభ నిర్వహిస్తామని, ముఖ్యఅతిథిగా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.ఉమామహేశ్వరరావు, మంతెన సీతారామ్ హాజరవుతారని తెలిపారు. సభల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని రవి కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తెల్లం రామకృష్ణ, పోలోజు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో జేసీ ధాత్రిరెడ్డి



ద్వారకాతిరుమల: స్థానిక చినవెంకన్న ఆలయాన్ని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి మంగళవారం సందర్శించారు. ఆమెకు దేవస్థానం అధికారులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఆమె స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆమెకు వేద ఆశీర్వచనాన్ని పలికి, పట్టు వస్త్రాలు, స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

డంపింగ్ యార్డుగా పుస్తక పంపిణీ కేంద్రం

- ద్వారకానగర్‌లో దాతల దాతృత్వం చెత్తపాలు
- పునః ప్రారంభానికి నోచుకోని వైనం
- వసతి ఉన్నా ప్రారంభించని గ్రంథాలయ సంస్థ



ద్వారకానగర్‌లో నిరుపయోగంగా ఉన్న పంచాయతీ షెడ్డు



షెడ్డులో ఉన్న అట్టలు, చెత్తా చెదారం

ద్వారకాతిరుమల: కొందరు అధికారుల నిర్లక్ష్యం వల్ల దాతల దాతృత్వం.. వారి ఆశయాలు నిరీర్యం అవుతున్నాయి. పది మందికి ఉపయోగపడాలన్న సదుద్దేశంతో దాతలు నిర్మించిన పాఠశాల షెడ్డు ఇప్పుడు నిరుపయోగంగా మారింది. డంపింగ్ యార్డుగా తయారైంది. పుస్తక పంపిణీకి అయినా దాన్ని కేటాయిస్తున్నారా అంటే అదీ లేదు. వివరాల్లోకి వెళితే.. ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లి పంచాయతీ పరిధిలోని ద్వారకానగర్‌లో 2001 సంవత్సరంలో సవలం వెంకటేశ్వరరావు, సత్యవతి పేరున వారి కుమారులు సవలం రత్తయ్య, సవలం కనకదుర్గారావులు అప్పట్లో రూ.లక్ష వెచ్చించి ఎంపీపీ పాఠశాల నిర్వహణకు ఒక షెడ్డు నిర్మించారు. మూడేళ్ల పాటు అందులో తరగతులు నిర్వహించారు. 2004లో ప్రభుత్వం ఆ గ్రామంలో పక్కా భవనాన్ని నిర్మించి, పాఠశాలను అందులోకి మార్చింది. ఆ తరువాత దాతలు నిర్మించిన షెడ్డులో పుస్తక పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆ కేంద్ర నిర్వాహకుడికి అప్పట్లో నెలకు రూ.300 గౌరవ వేతనంగా ఇచ్చేవారు. క్రమేపి అది రూ.1,000కి పెంచారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆ గౌరవ వేతనం ఒకేసారి రూ.3 వేలకు పెరిగింది. ఇదిలా ఉంటే పుస్తక పంపిణీ కేంద్రంగా ఉన్న షెడ్డును 2019లో పంచాయతీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆ తరువాత అక్కడే ఉన్న వంట షెడ్డులో కొద్దిరోజులు, అంగన్‌వాడీ కేంద్రం వరండాలో మరి కొన్ని రోజులు పుస్తక పంపిణీ కేంద్రం నిర్వహించారు.

మూతపడ్డ పుస్తక పంపిణీ కేంద్రం

అంగన్‌వాడీ కేంద్రం వరండాలో పుస్తక పంపిణీ కేంద్రం ఉండకూడదని జిల్లా గ్రంథాలయ శాఖ అధికారులు ఈ ఏడాది జనవరి 3న దాన్ని పూర్తిగా మూసివేశారు. వసతి చూపితే కేంద్రం ఏర్పాటుకు చర్యలు చేపడతామని తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన కమ్మిలి అరవిందరావు నివాసంలో ఏర్పాటు చేసిన ఉచిత వసతిలో పుస్తక పంపిణీ కేంద్రాన్ని నిర్వహించాలని పంచాయతీ అధికారులు సెప్టెంబర్ 10న గ్రంథాలయ అధికారులను లేఖ ద్వారా కోరారు. అయితే గ్రంథాలయ నూతన చైర్మన్‌ను నియమించే వరకు ఈ పుస్తక పంపిణీ కేంద్రాన్ని పునఃప్రారంభించడం కుదరదని ఆ సంస్థ అధికారులు చెబుతున్నట్టు కేంద్ర నిర్వాహకుడు వీఎం హరినాథరాజు తెలిపారు. డంపింగ్ యార్డుగా మారిన షెడ్డును తిరిగి పుస్తక పంపిణీ కేంద్రానికి కేటాయించేలా అధికారులు చర్యలు చేపట్టాలని పాఠకులు కోరుతున్నారు.

పుస్తక పంపిణీ కేంద్రం ఏర్పాటు చేయాలి



ఎంపీపీ పాఠశాలకు వసతి లేని సమయంలో నా తల్లిదండ్రులు పేరున షెడ్డును నిర్మించి ఇచ్చాం. ప్రభుత్వం పక్కా భవనం నిర్మించిన తరువాత పాఠశాలను అందులోకి మార్చారు. ఆ తరువాత షెడ్డును పుస్తక పంపిణీ కేంద్రానికి కేటాయించారు. ప్రజలకు ఉపయోగపడేలా చేశారని ఎంతో సంతోషించాం. కొద్దినెలల్లోనే దాన్ని డంపింగ్ యార్డుగా మార్చేశారు. మా ఆశయాలను చెత్తపాలు చేశారు. అధికారులు స్పందించి పుస్తక పంపిణీ కేంద్రాన్ని అందులో ఏర్పాటు చేయాలి.

– సవలం రత్తయ్య, దాత, ద్వారకానగర్

పంటల పరిశీలన



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ సుమలత

టి.నరసాపురం: మండలంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం వ్యవసాయాధికారి బి.సుమలత ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, సిబ్బంది బందంచర్ల, కేతవరం గ్రామాల్లో క్షేత్రస్థాయి పర్యటించి, పంటలను పరిశీలించారు. బందంచర్ల సచివాలయంలో రైతులతో ఏఓ సుమలత సమావేశం నిర్వహించారు. రబీ ఈ–పంట, కౌలు రైతుల కార్డులు జారీ, ధాన్యం కొనుగోలు, ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనలో మొక్కజొన్న, వరి పంటల బీమా తదితర ప్రభుత్వ పథకాలను రైతులకు వివరించారు.

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి



జంగారెడ్డిగూడెంలో ధర్నా చేస్తున్న నాయకులు



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

జంగారెడ్డిగూడెం: పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు ఉపసంహరించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యుడు కేవీ రమణ డిమాండ్ చేశారు. ట్రూ అప్ చార్జీలు, స్మార్ట్ మీటర్లను వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా కేవీ రమణ మాట్లాడుతూ ఎన్నికల ముందు అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని ప్రచారం చేసి, అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం ట్రూ అప్ చార్జీల పేరుతో యూనిట్‌కి 92 పైసలు విద్యుత్ చార్జీలు పెంచిందని ఆరోపించారు. స్మార్ట్ మీటర్ల పేరును ముందే రీచార్జి చేసుకునే విద్యుత్ మీటర్లు బిగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్. రామ్మోహన్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఈ.భూషణం, పీవైఎల్ జిల్లా నాయకులు తగరం బాబురావు, ప్రముఖ న్యాయవాది యు.ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

పోలవరం రూరల్: సామాన్యులపై విద్యుత్ చార్జీల పెంపు తగదని సీపీఎం మండల కార్యదర్శి కారం భాస్కర్ డిమాండ్ చేశారు. పోలవరం ఏటిగట్టు సెంటర్‌లో మంగళవారం విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ ఎన్నికల ముందు నాణ్యమైన విద్యుత్ ఇస్తానని, విద్యుత్ చార్జీలు పెంచనని ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బొరగం భూచంద్రరావు, తామ బాలరాజు, సముద్రాల సాయి కృష్ణ, నాయకులు గంగాదేవి, రాజు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పశువుల గర్భకోశ నివారణ శిబిరం



రైతులకు మందులు అందిస్తున్న వెటర్నరీ సిబ్బంది

కుక్కునూరు: పశువులలో గర్భకోశ వ్యాధి నివారణకు మంగళవారం మండలంలోని శ్రీధర వేలేరు రైతు సేవ కేంద్రంలో ఆరోగ్య శిబిరం పశుసంవర్ధక శాఖ పెంటపాడు ఉపసంచాలకులు యేసురత్నం ఆధ్వర్యంలో నిర్వహించారు. 22 మంది పాడి రైతులకు పశువుల గైనిక్ మందులు పంపిణీ చేశారు. 33 గేదెలు, 28 ఆవులకు వైద్య చికిత్సలు నిర్వహించారు. రక్తనమూనాలను సేకరించారు. గొర్రెలకు, మేకలకు ఉచితంగా నత్తల నివారణ మందులు లివర్ టానిక్‌లను పంపిణీ చేశారు. రైతులకు సలహాలు సూచనలు అందించారు. కార్యక్రమంలో జీలుగుమిల్లి పశు వైద్య ఆసుపత్రి సహాయ డైరెక్టర్, కొయ్యలగూడెం మండల పశు వైద్యాధికారి బీఆర్ శ్రీనివాసన్, దర్భగూడెం పశు వైద్యాధికారి లక్ష్మీప్రసన్న, గోపాలమిత్ర సిబ్బంది, వెటర్నరీ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కిశోర బాలికల భవిష్యత్తుకు పునాది



శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీఓ మురళీ కృష్ణ

చింతలపూడి : కిశోరి బాలికా వికాసం కార్యక్రమం బాలికల భవిష్యత్తుకు పునాది వేస్తుందని ఎంపీడీఓ మురళీకృష్ణ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా కిశోరి బాలికా వికాసం అధికారులు, సిబ్బంది శిక్షణ కార్యక్రమం సీడీపీఓ మాధవీలత ఆధ్వర్యంలో నిర్వహించారు. 11 నుంచి 18 ఏళ్ల బాలికలకు విద్య, ఆరోగ్యం, భద్రత, ఆర్థిక స్వావలంబనను మెరుగుపరచడం ఈ కార్యక్రమ లక్ష్యమని మురళీకృష్ణ న్నారు. నగర పంచాయతీ కమిషనర్ డి.పావని మాట్లాడుతూ ప్రతి గ్రామంలో బాలికల సంఘాలను ఏర్పాటు చేసి అవగాహన కల్పించడంతో పాటు, సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్టు తెలిపారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాలికలు, మహిళల భవిష్యత్తుకు దోహదం

బుట్టాయగూడెం: కిశోర బాలికలు, మహిళల ఉజ్వల భవిష్యత్‌కు కిశోరి వికాసం దోహదపడుతుందని ఎంపీడీఓ కె. జ్యోతి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం కిశోరి వికాసం కార్యక్రమంపై ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఎంఈఓ తెల్లం బాబూరావు, సీడీపీఓ ఎ.తులసి, ఐసీడీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తు బంగారు

కామవరపుకోట: కిశోరి వికాసం బాలికలకు బంగారు భవిష్యత్తు లాంటిదని ఎంపీడీఓ కె.సరళకుమారి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ అభివృద్ధి సమావేశ మందిరంలో కిశోర్ బాలిక వికాసం–2 కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓలు డి.సుబ్బారావు, సీహెచ్ ప్రశాంత్ కుమార్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, వెలుగు సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మద్దిలో భక్తుల కిటకిట



భక్తులతో కిటకిటలాడుతున్న మద్ది ఆంజనేయస్వామి ఆలయం

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం మద్ది క్షేత్రంలో మంగళవారం సందర్భంగా అంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తమలపాకులతో విశేష పూజలు చేశారు. భక్తుల హనుమద్ నామస్మరణతో ఆలయం మార్మోగింది. మధ్యాహ్నం ఒంటి గంట వరకు దేవస్థానాలకు వివిధ సేవల రూపంలో రూ.1,94,722 ఆదాయం సమకూరినట్టు ఈఓ ఆర్‌వీ చందన తెలిపారు. సుమారు 2000 మంది అన్నప్రసాదాన్ని స్వీకరించారన్నారు. ఏర్పాట్లను జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావు పర్యవేక్షించారు.

షష్ఠి ఉత్సవాలకు ముస్తాబు



బయ్యన్నగూడెంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం



సుబ్రహ్మణ్యేశ్వర స్వామి మూలవిరాట్

కొయ్యలగూడెం: మెట్ట ప్రాంత ప్రజల కొంగుబంగారంగా భాసిల్లుతున్న బయ్యన్నగూడెంలోని శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం షష్ఠి ఉత్సవాలకు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. మెట్ట ప్రాంత ప్రజలే కాకుండా తెలంగాణ నుంచి భక్తులు బయ్యనగూడెం ఆలయానికి వచ్చి మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఏడాది పొడవునా ప్రతి మంగళవారం ఇక్కడ అన్నదానం చేస్తున్నారు. ఈ నెల 6వ తేదీ స్వామివారి కల్యాణోత్సవం, 7వ తేదీ నుంచి ఐదు రోజులపాటు షష్ఠి మహోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త బాలం దత్తుడు తెలిపారు. ప్రస్తుతం ఉన్న జాతీయ ప్రధాన రహదారికి అనుకుని సుమారు వందేళ్ల క్రితం భారీ పుట్ట ఉండేదని, అది వర్షాలతో క్రమేపి కరిగిపోగా అందులో దేవేరులతో సహా స్వామివారి మూలవిరాట్ విగ్రహాలు బయటపడినట్టు పూర్వీకుల ద్వారా తెలుస్తోందన్నారు. 1938వ సంవత్సరంలో దివంగత బాల వెంకటరామయ్య, దేవమ్మ పుణ్య దంపతులు, కరణం మానాప్రగడ చలపతిరావు, తుమ్మలపల్లి వెంకటస్వామి, శ్రీ సాయిల సోమన్నల కృషితో స్థలం, పైకం సమకూరి ఆలయ నిర్మాణానికి అంకురార్పణ చేశారని తెలిపారు. కొన్నేళ్ల క్రితం వరకు నాగపాము ఆలయంలోకి వెళ్లి రావడం అర్చకులతో పాటు భక్తులు చూసేవారని చెప్పారు. కుజదోష నివారణకు, ఉద్యోగాల కోసం, సంతానం కోసం గుడిలోని స్వామివారిని దర్శించుకుంటే కోర్కెలు నెరవేరతాయని భక్తుల నమ్మకమన్నారు.

ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి



ధర్మాజీగూడెంలో బహుమతులు అందుకున్న విద్యార్థులు



కొయ్యలగూడెం ఎంపీపీ స్కూల్ మెయిన్‌లో..

లింగపాలెం: దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని ఎంఈఓలు కాంటా రామారావు, జంగం రవీంద్ర సూచించారు. అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం ధర్మాజీగూడెం భవిత కేంద్రం ఆధ్వర్యంలో వేడుక నిర్వహించారు. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓలు సూచించారు. ఆటపాటల్లో గెలుపొం దిన దివ్యాంగులైన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు బీవీఎస్ఎన్ రాజు, ఫిజియోథెరపిస్ట్ ఎం.శ్రీనాథ్, రంగాపురం హైస్కూల్ ప్రతిభావంతుల ప్రత్యేక ఉపాధ్యాయులు టి.సందీప్, ఐఈఆర్టీలు మాణిక్యమ్మ, భాగ్యలక్ష్మి, కనకమ్మ పాల్గొన్నారు.

దివ్యాంగులకు చేయూత అందించాలి

కొయ్యలగూడెం: దివ్యాంగులకు చేయూత ఇవ్వాలని ఎంపీడీఓ కె.కిరణ్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక కన్నాపురం రోడ్డులోని ఎంపీపీ స్కూల్ మెయిన్‌లో భవిత దివ్యాంగుల కేంద్రం ప్రతినిధులు టి.సరస్వతి, బి.జయలక్ష్మి ఆధ్వర్యంలో దివ్యాంగులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. హెచ్‌ఎం యు.కోటేశ్వరరావు రూ.5 వేలు విలువైన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్, ఉపాధ్యాయులు శివరామ హరిప్రసాద్, ఎం.బాలాత్రిపుర సుందరి, హెచ్‌ఎం అబ్బులు తదితరులు అందజేసిన విద్యాసామగ్రి, మధ్యాహ్న భోజన సామగ్రిని బాలలకు అందజేశారు. ఏలూరు జిల్లా కెమిస్ట్రీ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు గుత్తా రవిచంద్ర 50 బాక్స్‌లను విద్యార్థులకు అందించారు. ఎంఈఓ జె.సురేష్ బాబు, ఎం.ఉమామహేశ్వరరావు, జి.గంగాధర్, మధు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

హక్కులు, చట్టాలపై అవగాహన

జంగారెడ్డిగూడెం: స్థానిక ఇందిరానగర్ కాలనీలోని భవిత విభిన్న ప్రతిభావంతుల పాఠశాల ఆధ్వర్యంలో ఉపాధ్యాయిని జి.రజిని ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కౌన్సిలర్ వలవల తాతాజీ, ఎంఈఓ జి.రాములు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ముళ్లపూడి శ్రీనివాస్, బార్ ప్రతినిధులు తదితరులు మాట్లాడారు. విభిన్న ప్రతిభావంతుల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. మండలంలో 160 మంది విభిన్న ప్రతిభావంతులు ఉన్నారని తెలిపారు. కౌన్సిలర్ నంబూరి రామచంద్రరాజు క్షత్రియ సేవా సమితి ద్వారా భవిత పాఠశాలకు సహకారం అందిస్తామన్నారు. వివిధ అంశాల్లో ప్రతిభ చూపిన చిన్నారులకు బహుమతులు అందజేశారు. బార్ సభ్యులు పండు, ఉక్కుర్తి సీతారాం భోజనం అందజేశారు. జంగారెడ్డిగూడెం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో దివ్యాంగ విద్యార్థులకు ఉపాధ్యాయుల ఆర్థిక సాయంతో బహుమతులను హెచ్‌ఎం లోవకుమారి అందజేశారు.

దివ్యాంగులను ప్రోత్సహించాలి

చింతలపూడి : దివ్యాంగులను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి సి.మధు బాబు అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించారు. న్యాయ పరంగా ఏటువంటి సలహా కావాలన్న న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయం అందిస్తామని జడ్జి మధుబాబు తెలిపారు. ఎంఈఓ–2 ఎస్ కిరణ్ బాబు పాల్గొన్నారు.

ఏపీఆర్‌ఈయూ జిల్లా అధ్యక్షుడిగా సోడిశెట్టి

ద్వారకాతిరుమల: ఆంధ్రప్రదేశ్ రిపోర్టర్స్ అండ్ ఎడిటర్స్ యూనియన్ (ఏపీఈఆర్‌యూ) ఏలూరు జిల్లా కార్యవర్గ సమావేశం స్థానిక ఒక అతిథి గృహంలో రాష్ట్ర అధ్యక్షుడు చొప్పరపు సాంబశివ నాయుడు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఈఆర్‌యూ జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సోడిశెట్టి శాంతకుమార్‌కు సాంబశివరావు నియామక పత్రాన్ని అందించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుచ్చిబాబు, యూనియన్ ప్రధాన కార్యదర్శి అడుసుమిల్లి రాధాకృష్ణ, జిల్లా నూతన అధ్యక్షుడు శాంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

టి.నరసాపురం: మండలంలోని రాజుపోతేపల్లి గ్రామంలో ఇంటి స్థలం వివాదం నేపథ్యంలో కత్తితో దాడి చేసిన ఘటనపై కేసు నమోదు చేశామని ఎస్సై ఎం జయబాబు తెలిపారు. రాజుపోతేపల్లికి చెందిన నత్త నాగరాజు, గుమ్మళ్ల స్వామికి ఇంటి స్థలం వివాదం కొన్నాళ్లుగా నడుస్తోందన్నారు. ఈ క్రమంలో ఈనెల 2న నాగరాజు స్థానిక సచివాలయానికి వెళ్లి తిరిగి వస్తుండగా, స్వామి కత్తితో దాడి చేశాడని తెలిపారు. గాయపడిన నాగరాజు చింతలపూడి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడన్నారు. నాగరాజు భార్య సుజానమ్మ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

జూదరుల అరెస్ట్

కొయ్యలగూడెం: గవరవరంలో సోమవారం రాత్రి జూద శిబిరాలపై దాడులు చేశామని ఎస్సై వి.చంద్రశేఖర్ తెలిపారు. నిందితుల నుంచి రూ.1.23 లక్షలు, 5 కోడి పుంజులు, 5 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. ఈ మేకు కేసు నమోదు చేశామని ఎస్సై మంగళవారం తెలిపారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

చింతలపూడి : అల్లిపల్లి గ్రామంలో మంగళవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఒక మహిళను అరెస్ట్ చేసి, 20 మద్యం బాటిళ్లను స్వాధీన చేసుకున్నట్టు సీఐ పి.అశోక్ తెలిపారు. మహిళను స్థానిక తహసీల్దార్ ఎదుట హాజరు పరచి బైండ్ ఓవర్ చేశామన్నారు. చింతలపూడి ఎక్సైజ్ ఎస్సై అబ్దుల్ ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు తాడేపల్లిగూడెంకు చెందిన ఊటుకూరి నాగ లవకుమార్ మంగళవారం రూ.1 లక్ష విరాళంగా అందజేశారు. ఆ సొమ్మును ఆలయ కార్యాలయంలో జమ చేశారు. తొలుత ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.